సాక్షి
మెదక్
గురువారం । 15 । మే । 2025



అటకెక్కిన అవుట్ పోస్టులు

మూడు జిల్లాలు.. 20 రైల్వేస్టేషన్లు.. ఒకే ఒక పోలీస్ అవుట్ పోస్టు ఇదీ రైల్వేశాఖ పరిస్థితి.

వివరాలు 8లో ▸



వరుస దొంగతనాలు

వరుస దొంగతనాలకు పాల్పడుతున్న కుటుంబ సభ్యుల ముఠాను పోలీసులు అరెస్టు చేశారు.

వివరాలు 8లో ▸



శిఖం భూముల అన్యాక్రాంతం

శివ్వంపేట మండలంలో చెరువులు, కుంటలకు సంబంధించిన శిఖం భూములు అన్యాక్రాంతం అవుతున్నాయి.

వివరాలు 9లో ▸

న్యూస్‌రీల్

వీరభద్రుడికి మంత్రి ప్రత్యేక పూజలు



పూజలు నిర్వహిస్తున్న మంత్రి దామోదర

టేక్మాల్(మెదక్): మండలంలోని బొడ్మట్‌పల్లి గుట్టపై వెలసిన భద్రకాళీ సమేత వీరభద్రుడి కల్యాణోత్సవం బుధవారం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. మంత్రి దామోదర రాజనర్సింహ ఉత్సవాల్లో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం రాష్ట్ర మాజీ ట్రేడ్ కార్పొరేషన్ చైర్మన్ మఠం భిక్షపతి, మాజీ ఎమ్మెల్యే క్రాంతికిరణ్ వీరభద్రుడికి పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకుడు వీరన్నస్వామి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు. సాయంత్రం స్వామి వారి ఉత్సవ విగ్రహాలతో భక్తులు ఊరేగింపు నిర్వహించారు. మెదక్ ఆర్డీఓ రమాదేవి, డీఎస్పీ ప్రసన్నకుమార్, డీఎంహెచ్ఓ శ్రీరాం, జోగిపేట మార్కెట్ కమిటీ చైర్మన్ జగన్మోహన్‌రెడ్డి, నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఇసుక రవాణా చేస్తే కేసులు

సాక్షి ఎఫెక్ట్

పాపన్నపేట(మెదక్): మంజీరా నది నుంచి ఇసుకను ఏ రూపాన రవాణా చేసినా కేసులు నమోదు చేస్తామని పాపన్నపేట తహసీల్దార్ సతీష్‌కుమార్ హెచ్చరించారు. బుధవారం 'సాక్షి'లో 'ఇసుకా సురుల తిరకాసు దందా' శీర్షికన ప్రచురితమైన కథనానికి స్పందించారు. రెవెన్యూ, పోలీస్ సిబ్బందిని తనిఖీల కోసం యూసుఫ్‌పేట శివారులోని మంజీరా తీర ప్రాంతానికి పంపించారు. అయితే గాడిదలపై ఇసుక రవాణా చేసే వారు అక్కడి నుంచి వెళ్లిపోయారని తెలిపారు. వారి కుటుంబీకులు అక్కడ ఉండగా, మంజీరా నుంచి ఇసుక తీయొద్దని హెచ్చరించినట్లు చెప్పారు. ట్రాక్టర్లు, లారీలు, గాడిదలపై ఏ రూపాన ఇసుక రవాణా చేసినా కేసులు నమోదు చేస్తామని హెచ్చరించినట్లు వివరించారు.

భూ సమస్యలకు పరిష్కారం



దరఖాస్తులను పరిశీలిస్తున్న ఆర్డీఓ మహిపాల్

చిలప్‌చెడ్(నర్సాపూర్): భూ సమస్యలు ఉన్న రైతులకు భూ భారతి చట్టంతో సులభ పరిష్కారం దొరుకుతుందని నర్సాపూర్ ఆర్డీఓ మహిపాల్ అన్నారు. బుధవారం చిలప్‌చెడ్ రైతువేదికలో నిర్వహించిన రెవెన్యూ సదస్సును పరిశీలించి మాట్లాడారు. పైలెట్ ప్రాజెక్టుగా ఎంపికైన చిలప్‌చెడ్‌లో రెవెన్యూ సదస్సులు ముగిశాయని తెలిపారు. మండలంలోని 15 రెవెన్యూ గ్రామాల్లో పది రోజుల్లో జరిగిన సదస్సుల్లో సుమారు 900 దరఖాస్తులు వచ్చాయని, అందులో ఎక్కువగా సాదాబైనామలు, పేరు మార్పిడిలు ఉన్నాయన్నారు. త్వరలోనే దరఖాస్తులను పరిశీలించి, విచారణ జరిపి, సమస్యలు పరిష్కరించే విధంగా చర్యలు చేపడతామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ సహదేవ్, డిప్యూటీ తహసీల్దార్ సింధూజ, ఆర్ఐలు సునీల్ సింగ్, వెంకటేశ్వర్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ఆకట్టుకున్న కుస్తీ పోటీలు



కుస్తీ పడుతున్న మల్లయోధులు

పెద్దశంకరంపేట(మెదక్): మండల పరిధిలోని చీలాపల్లి దుర్గమ్మ జాతరలో భాగంగా నిర్వహించిన కుస్తీ పోటీలు ఆకట్టుకున్నాయి. బుధవారం ఆలయ ఆవరణలో నిర్వహించిన పోటీల్లో వివిధ ప్రాంతాలకు చెందిన మల్లయోధులు పాల్గొన్నారు. విజేతలకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో బహుమతులు అందజేశారు.

కోతి దాడిలో బాలుడికి గాయాలు


చేగుంట(తూప్రాన్): కోతి దాడిలో బాలుడు గాయపడిన సంఘటన మండల కేంద్రంలోని ఎన్‌జీఓ కాలనీలో బుధవారం సాయంత్రం చోటు చేసుకుంది. కాలనీలోని ఓ భవనంలో అద్దెకు ఉన్న దంపతుల మూడు సంవత్సరాల బాలుడు ఆడుకుంటుండగా కోతుల గుంపు వచ్చింది. అందులోని ఓ కోతి బాలుడిని కరిచింది. దీంతో స్థానికులు బాలుడిని ఆస్పత్రికి తరలించి వైద్యం అందించారు.

"తూప్రాన్ పట్టణంలోని ఓ ప్రైవేట్ నర్సింగ్ హోంలో సాధారణ ప్రసవం కోసం మండలంలోని ఓ గ్రామానికి చెందిన మహిళ వచ్చింది. అన్ని రకాల పరీక్షలు నిర్వహించిన ఆస్పత్రి వైద్యులు శిశువు ఉమ్మ నీరు మింగింది, వెంటనే ఆపరేషన్ చేయాలి, లేదంటే తల్లి ప్రాణాలకు ప్రమాదం అని చెప్పారు. ఆందోళనకు గురైన కుటుంబ సభ్యులు ఆపరేషన్ చేయడానికి అంగీకరించారు. తీరా ఆపరేషన్ చేశాక శిశువు మృతి చెందిందని చెప్పారు. దీంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు."

ప్రైవేట్ ఆస్పత్రుల ఇష్టారాజ్యం!

రోగుల ప్రాణాలతో చెలగాటం

- వైద్యం పేరుతో దోపిడీ
- కొరవడిన అధికారుల పర్యవేక్షణ



తూప్రాన్: జిల్లాలోని ప్రైవేట్ ఆస్పత్రుల నిర్వాహకులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. వచ్చీరాని వైద్యంతో రోగుల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారు. ఆర్ఎంపీ వైద్యుల చేత వైద్యం అందిస్తూ రూ. లక్షలు గడిస్తున్నారు. జిల్లాలో 138 ప్రైవేట్ ఆస్పత్రులు, 52 డయగ్నోస్టిక్ సెంటర్లు, 36 స్కానింగ్ సెంటర్లు ఉన్నాయి. అయితే గుట్టుచప్పుడు కాకుండా కొన్ని ప్రైవేట్ ఆస్పత్రులు కొనసాగుతున్నాయనే ఆరోపణలు ఉన్నాయి. ప్రైవేట్ వైద్యులకు కొంతమంది వైద్యారోగ్యశాఖ అధికారుల మధ్య స్నేహపూర్వక ఒప్పందం ఉండడంతో నామమాత్రంగా తనిఖీలు నిర్వహిస్తున్నారు.

తూతూమంత్రంగా తనిఖీలు

వైద్యం పేరిట రోగుల నుంచి రూ. లక్షల్లో డబ్బులు వసూలు చేస్తున్నా పట్టించుకోవడం లేదు. ఇటీవల జిల్లాలోని ప్రైవేట్ ఆస్పత్రులను వైద్యాధికారుల బృందం తనిఖీ చేసినా, ఎలాంటి వివరాలు వెల్లడించకపోవడం గమనార్హం. నర్సింగ్ హోంలలో ఆర్ఎంపీ వైద్యుల చేత వైద్య చికిత్స అందిస్తూ రూ. లక్షలు గడిస్తున్నారు. పలు సంఘటనల్లో ఆర్ఎంపీల చికిత్సతో వైద్యం వికటించి రోగులు మరణించిన ఘటనలు ఉన్నాయి. అయినా ఆ ఆస్పత్రులపై చర్యలు తీసుకోకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. ఆస్పత్రిలో వైద్యంతో పాటు వివిధ వైద్య పరీక్షల పేరిట రోజూ రూ. లక్షల్లో వసూలు చేస్తున్నా వైద్యారోగ్యశాఖ పట్టించుకోవడం లేదు. ఇదిలా ఉండగా ఆర్ఎంపీ వైద్యులు నర్సింగ్‌హోంలు ఏర్పాటు చేసి చుట్టపు చూపుగా వచ్చే ఎంబీబీఎస్ వైద్యుల చేత వైద్య చికిత్స చేయిస్తున్నారు. అత్యవసర సమయాల్లో వారు అందుబాటులో లేకపోతే ఆస్పత్రిలో పనిచేసే సిబ్బందితో వైద్యం అందిస్తూ రోగుల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారు. అయినా ఈ విషయం బయటకు పొక్కకుండా ఆస్పత్రి వర్గాలు జాగ్రత్తలు తీసుకుంటున్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ప్రైవేట్ ఆస్పత్రులపై నిఘా ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు. ఇదే విషయమై డీఎంహెచ్ఓ శ్రీరాంను ఫోన్‌లో సంప్రదించగా స్పందించలేదు.

ముందుచూపేది?

- మెదక్ బల్దియా తీరుతో వ్యాపారులకు తిప్పలు
- ముందుకుసాగని షాపింగ్ కాంప్లెక్స్‌ల నిర్మాణాలు



20 ఏళ్ల క్రితం టెండర్ పూర్తయిన స్థలంలో కొనసాగుతున్న షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణాలు

మెదక్‌జోన్: 'ఆలు లేదు, సూలు లేదు కొడుకు పేరు సోమలింగం' అన్న చందంగా మారింది మెదక్ బల్దియా పరిస్థితి. ముందుచూపు లేని నేతల నిర్ణయాలతో వ్యాపారులకు ఇబ్బందులు తప్పడం లేదు. జిల్లా కేంద్రంలోని రాందాస్ చౌరస్తా వద్ద మున్సిపాలిటీకి చెందిన అర ఎకరం ఖాళీ స్థలం ఉండగా, అందులో 12 షాపింగ్ కాంప్లెక్స్‌లు నిర్మించి అద్దెకిస్తామని రెండు దశాబ్దాల క్రితం ఓపెన్ టెండర్ పిలిచారు. వాటిని దక్కించుకునేందుకు పట్టణానికి చెందిన 150 మంది వ్యాపారులు పోటీ పడ్డారు. ఓపెన్ టెండర్ ద్వారా 12 మంది ఆ స్థలాన్ని చేజిక్కించుకొని రూ. 1.50 కోట్లు మున్సిపాలిటీకి చెల్లించారు. అయితే సకాలంలో నిర్మాణాలు ప్రారంభించకపోవడంతో డబ్బులు చెల్లించిన కొందరు కోర్టును ఆశ్రయించారు. కోర్టు ఆదేశంతో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణానికి ప్రభుత్వం రెండేళ్ల క్రితం రూ. 3 కోట్లు మంజూరు చేసింది. అయితే రెండేళ్లుగా నిర్మాణ పనులు నత్తనడకన సాగుతున్నాయి.

కోర్టును ఆశ్రయించిన 67 మంది

పట్టణంలోని రాందాస్ చౌరస్తా సమీపంలో రోడ్డుకు ఇరువైపులా మున్సిపాలిటీకి చెందిన 67 షాపులు ఉన్నాయి. వాటిని పలువురు వ్యాపారస్తులకు అద్దెకు ఇవ్వడంతో నెలకు రూ. 2.50 లక్షల ఆదాయం వస్తోంది. అయితే అవి శిథిలావస్థకు చేరాయని, వాటిని కూల్చివేసి ఆ స్థలంలో నూతన షాపింగ్ మాల్స్ నిర్మించాలని నిర్ణయించారు. వెంటనే ఖాళీ చేయాలంటూ గతేడాది మున్సిపల్ అధికారులు వ్యాపారస్తులకు నోటీసులు జారీ చేశారు. అయితే వారు ఖాళీ చేయకపోవడంతో బలవంతంగా ఖాళీ చేయిస్తామని హెచ్చరించారు. దీంతో వ్యాపారులు హైకోర్టును ఆశ్రయించారు. గతంలో కూల్చిన షాపుల స్థలంలో కొత్తవి నిర్మించటం లేదని, ఖాళీ స్థలానికి టెండర్ వేసి 20 ఏళ్లు గడిచినా నేటికీ నిర్మాణాలు చేపట్టడం లేదని, మున్సిపల్ పాలకవర్గంపై మాకు నమ్మకం లేదని చెప్పారు. షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణానికి బడ్జెట్ మంజూరయితే ఆ బడ్జెట్‌లో 40 శాతం నిధులు మున్సిపాలిటీకి ముందుగా చెల్లిస్తామని, అప్పటి వరకు ఖాళీ చేయమని తేల్చిచెప్పారు.

14 షాపులు కూల్చివేత

అలాగే మున్సిపాలిటీ పరిధిలోని కూరగాయల మార్కెట్‌లో బల్దియాకు చెందిన 14 షాపులు ఉండగా, ఆ స్థలంలో అధునాతన షాపింగ్ కాంప్లెక్స్ నిర్మిస్తామని మూడేళ్ల క్రితం కౌన్సిల్ తీర్మానం చేసి ఆ షాపులను కూల్చివేశారు. అప్పటి నుంచి అక్కడ ఎలాంటి నిర్మాణాలు చేపట్టడం లేదు. దీంతో దూర ప్రాంతాల నుంచి కూరగాయలు తెచ్చి విక్రయించుకునే రైతులతో పాటు కూరగాయల వ్యాపారస్తులు ఎండలోనే వ్యాపారం సాగించాల్సిన పరిస్థితి నెలకొంది.

ఇప్పట్లో నిర్మించలేం

"కూరగాయల మార్కెట్‌లో కూల్చివేసిన షాపుల స్థలంలో నూతనంగా షాపులు నిర్మించటం ఇప్పట్లో సాధ్యం కాదు. దానికి ప్రత్యేక బడ్జెట్ వచ్చే వరకు నిర్మాణాలు ముందుకుసాగవు. గతంలో టెండర్ వేసిన ఖాళీ స్థలంలో మున్సిపల్ కాంప్లెక్స్ నిర్మాణం కోసం రూ. 3 కోట్లు మంజూరు కాగా, నిర్మాణాలు చేపడుతున్నాం. 67 షాపులలో అద్దెకు ఉన్నవారు కోర్టును ఆశ్రయించిన మాట వాస్తవమే."

– శ్రీనివాస్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్

మెదక్ టు తిరుపతి రైలు నడపండి

రైల్వే జీఎంను కోరిన ఎంపీ రఘునందన్



ఎంపీకి మెదక్- మీర్జాపల్లి రైల్వేలైన్ మ్యాప్‌ను అందజేస్తున్న నాయకులు

మెదక్‌జోన్: ప్రజల కోరిక మేరకు మెదక్ నుంచి తిరుపతి, నిజామాబాద్, నాందెడ్ లాంటి దూర ప్రాంతాలకు రైళ్లు నడపాలని మెదక్ ఎంపీ రఘునందన్‌రావు రైల్వే జీఎంను ఫోన్ ద్వారా కోరారు. బుధవారం ఆయన మెదక్ రైల్వేస్టేషన్‌ను సందర్శించి రైల్వే అధికారులతో చర్చించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మెదక్- మీర్జాపల్లి లింక్ రైల్వేలైన్ ప్రణాళికలకు సంబంధించి ప్రజలు కోరుతున్నారని, ఈ అంశాన్ని పరిగణలోకి తీసుకోవాలన్నారు. ప్రస్తుతం మెదక్‌కు నడుస్తున్న రెండు రైళ్లలో మార్పులపై చర్చించి, మరింత మెరుగుగా ప్రయాణికులను అనుగుణంగా రైళ్లను నడపాలన్నారు. అదేవిధంగా స్టేషన్‌లో జరుగుతున్న అభివృద్ధి పనులను స్వయంగా పరిశీలించారు. ధ్యాన్‌చంద్ చౌరస్తా నుంచి రైల్వేస్టేషన్ వరకు వీధి దీపాలు వేస్తే ప్రయాణికులకు రాత్రి వేళల్లో వెలుతురు ఉంటుందని చెప్పారు. అంతకుముందు ఎంపీకి బీజేపీ నేతలు మెదక్- మీర్జాపల్లి వరకు లింక్ కలపాలని మ్యాప్‌ను అందజేశారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు మల్లేశం గౌడ్, మాజీ అధ్యక్షుడు గడ్డం శ్రీనివాస్, నాయకులు ఎంఎల్ఎన్ రెడ్డి, శివ, నాయిని ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

రైతుల ఖాతాల్లో ధాన్యం డబ్బులు

- ఆర్డీఓ జయచంద్రారెడ్డి



నిర్వాహకులతో మాట్లాడుతున్న ఆర్డీఓ జయచంద్రారెడ్డి

తూప్రాన్: డివిజన్ పరిధిలో 5,557 మంది రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేసిన వారిలో 2,801 మంది రైతుల ఖాతాలో రూ. 25.32 కోట్లను ప్రభుత్వం జమ చేసిందని ఆర్డీఓ జయచంద్రారెడ్డి తెలిపారు. మండలంలోని ఆయా కొనుగోలు కేంద్రాలను బుధవారం సందర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. చేగుంట మండలంలో 1,214 మంది రైతులకు రూ. 10.64 కోట్లు, వెల్దుర్తిలో 685 మంది రైతులకు రూ. 6.44 కోట్లు, నార్సింగిలో 609 మంది రైతులకు రూ. 5.53 కోట్లు, మాసాయిపేట మండలంలో 226 మంది రైతులకు రూ. 1.80 కోట్లు, తూప్రాన్ మండలంలో 58 మంది రైతులకు రూ. 57 లక్షలు, మనోహరాబాద్ మండలంలో 29 మంది రైతులకు రూ. 33 లక్షలు జమ చేసినట్లు వివరించారు. మిగిలిన రైతుల ఖాతాల్లో త్వరగా డబ్బులు జమ అవుతాయని, ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని చెప్పారు.

ఉద్యాన పంటలకు చేయూత



ఖర్జూరతోటను పరిశీలిస్తున్న అధికారులు

రామాయంపేట(మెదక్): రామాయంపేటలో సాగవుతున్న ఖర్జూర తోటను బుధవారం జిల్లా అధికారుల బృందం సందర్శించింది. జిల్లా హార్టికల్చర్ అధికారి ప్రతాప్‌సింగ్, మెదక్ డివిజన్ అధికారిణి రచన, పట్టు పరిశ్రమల శాఖ జిల్లా అధికారి నర్సింహాచారి, జిల్లా సహాయ అధికారి లింగయ్య తోటను సందర్శించి రైతు సత్యనారాయణకు పలు సూచనలు చేశారు. ఈసందర్భంగా హార్టికల్చర్ జిల్లా అధికారి ప్రతాప్‌సింగ్ మాట్లాడుతూ.. రైతులు ఉద్యాన పంటలపై దృష్టి సారించాలని సూచించారు. మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా ఖర్జూర, అయిల్‌పాం, జామ, నిమ్మ, అరటి, బొప్పాయి వంటి పంటలు సాగు చేస్తే అధిక లాభాలు ఆర్జించే అవకాశం ఉందని వివరించారు. ఉద్యాన పంటలకు డ్రిప్ ఏర్పాటు కోసం ప్రభుత్వం సబ్సిడీ ఇస్తుందని, ఎస్సీ, ఎస్టీ రైతులకు వందశాతం, బీసీ సన్నకారు, చిన్నకారు రైతులకు 90 శాతం ,ఇతర రైతులకు 80 శాతం సబ్సిడీ ఇస్తుందన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో వరిసాగుతో అంతగా లాభాలు ఆర్జించే అవకాశం లేదని, ఉద్యాన పంటలతో మంచి లాభాలుంటాయని తెలిపారు. కార్యక్రమంలో రైతులు తదితరులు పాల్గొన్నారు.

'విద్యార్థులు డ్రాపౌట్ కాకుండా చూడాలి'

మెదక్ మున్సిపాలిటీ: విద్యార్థులు పాఠశాలల నుంచి డ్రాపౌట్ కాకుండా చూసుకోవాల్సిన బాధ్యత టీచర్లదేనని జిల్లా సంక్షేమాధికారిణి హైమావతి అన్నారు. బుధవారం పట్టణంలోని బోయిగల్లీ, పిట్లంబేస్ అంగన్‌వాడీ కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ.. చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం తప్పకుండా అందించాలని, ఈ విషయంలో ఏమాత్రం నిర్లక్ష్యం వహించినా చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రభుత్వం ద్వారా అందించే ప్రతి పథకం అర్హులకు చేరేలా చూడాలని.. అదే సమయంలో అంగన్‌వాడీ కేంద్రాలను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు అన్ని రకాల సౌకర్యాలు ఉండేలా చూసుకోవాలని సూచించారు. ఆమె వెంట అంగన్‌వాడీ సూపర్‌వైజర్ జయంతితో పాటు టీచర్లు తదితరులు ఉన్నారు.

భూముల సర్వే అడ్డగింత

- నోటీసులు ఇవ్వకుండా సర్వే చేయడంపై గిరిజనుల ఆగ్రహం



సర్వేను అడ్డుకుంటున్న గిరిజనులు

చిన్నశంకరంపేట(మెదక్): వివాదంలో ఉన్న భూములను సర్వే చేసేందుకు వచ్చిన అధికారులను గిరిజనులు అడ్డుకున్నారు. ఈ సంఘటన మండలంలోని కామారంతండాలో బుధవారం జరిగింది. తమకు కనీసం నోటీసులు ఇవ్వకుండా సర్వే ఎలా చేస్తారని గిరిజనులు ప్రశ్నించారు. తమకు తెలియకుండానే ఓ రియల్టర్ తప్పుడు పత్రాలు సృష్టించి రిజిస్ట్రేషన్ చేసుకున్నారని, ఈ వివాదం కోర్టులో ఉందని తెలిపారు. పట్టాదారును అని చెప్పుకొనే వ్యక్తి సర్వే వద్దకు ఎందుకు రాలేదని మండిపడ్డారు. సర్వే చేసేందుకు తీసుకువచ్చిన డిజిటల్ మిషన్‌ను గిరిజనులు లాక్కునేందుకు ప్రయత్నించగా అధికారులు సర్వేను మధ్యలోనే నిలిపివేసి వెనక్కి తిరిగారు. ఈసందర్భంగా గిరిజనులు మాట్లాడుతూ.. వివాదంలో ఉన్న భూమి విషయంలో పోలీస్‌లు సైతం బడా వ్యక్తులకు అండగా నిలుస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. చిన్నశంకరంపేట ఎస్ఐ నారాయణగౌడ్, తూప్రాన్ సీఐ కృష్ణ ఆధ్వర్యంలో పెద్ద సంఖ్యలో పోలీస్ బందోబస్తు నిర్వహించారు. సర్వే ఏడీ శ్రీకాంత్ మాట్లాడుతూ.. కోర్టులో కేసు ఉన్నప్పటికీ పట్టాదారు దరఖాస్తు చేయడంతోనే తాము సర్వే చేసేందుకు వచ్చామని తెలిపారు. గతంలో సర్వేను అడ్డుకోవడంతోనే పోలీస్ బందోబస్తు కోరామని చెప్పారు.

ఏఐపై విద్యార్థులకు ఇంటర్న్‌షిప్

మెదక్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ హుస్సేన్



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ హుస్సేన్

మెదక్‌జోన్: మెదక్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల కంప్యూటర్ సైన్స్ విభాగం ఆధ్వర్యంలో 10 రోజుల పాటు నిర్వహించిన ఇంటర్న్‌షిప్ విజయవంతంగా కొనసాగినట్లు కళాశాల ప్రిన్సిపాల్ హుస్సేన్ తెలిపారు. శిక్షణ కార్యక్రమాన్ని పూర్తి చేసుకున్న విద్యార్థులకు బుధవారం కళాశాలలో సర్టిఫికెట్లు అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మ్యాజిక్ బస్ ఇండియా ఫౌండేషన్ సహకారంతో డిగ్రీ తృతీయ సంవత్సరం విద్యార్థులకు సాఫ్ట్ స్కిల్స్, కృత్రిమ మేధ అనువర్తనాలపై 10 రోజుల ఇంటర్న్‌షిప్‌ను విజయవంతంగా నిర్వహించినట్లు చెప్పారు. అలాగే కళాశాలలో ఏర్పాటు చేసిన జాబ్ మేళాను ప్రారంభించారు. తగిన అవకాశాలు లభిస్తే విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించగలరని పేర్కొన్నారు. ఉద్యోగ అవకాశాలు కల్పించడంలో హెచ్ఆర్ ప్రతినిధులు కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో అధ్యాపకులు ప్రవీణ్ కుమార్, సురేందర్‌రావు, కాశీ విశ్వనాథ్, డాక్టర్ కిరణ్ కుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యా, వైద్యమే ప్రధాన ఎజెండా

మెదక్ ఎమ్మెల్యే రోహిత్‌రావు



ఇంటర్‌లో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులతో ఎమ్మెల్యే రోహిత్, కలెక్టర్ రాహుల్‌రాజ్

మెదక్ కలెక్టరేట్: విద్యా, వైద్యమే ప్రభుత్వ ప్రధాన ఎజెండాగా పనిచేస్తున్నామని మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు అన్నారు. ఇంటర్ ఫలితాల్లో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను బుధవారం కలెక్టరేట్‌లో సన్మానించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు.. 14 నెలల్లో క్షేత్రస్థాయిలో పర్యటించి అన్ని పాఠశాలల్లో మరుగుదొడ్ల వసతి కల్పించినట్లు తెలిపారు. విద్యాశాఖలో సమూల మార్పుల కోసం కృషి చేస్తున్నట్లు చెప్పారు. ఇందులో భాగంగా రామాయంపేటలో రూ. 200 కోట్లతో 20 ఎకరాల్లో యంగ్ ఇండియా రెసిడెన్షియల్ పాఠశాలను మంజూరు చేసినట్లు వివరించారు. మెదక్‌లో ఇంటర్ మూల్యాంకన సెంటర్ మంజూరు చేయించిన ఘనత మాదేనని స్పష్టం చేశారు. అలాగే రూ. 3 కోట్ల స్కాలర్‌షిప్‌లు మంజూరు చేయించామన్నారు. అనంతరం కలెక్టర్ రాహుల్‌రాజ్ మాట్లాడుతూ.. ప్రభుత్వ కళాశాలల్లో చదివి ఇంటర్మీడియెట్ విద్యను అభ్యసిస్తూ ఉత్తమ ఫలితాలు సాధించడం గర్వించదగిన విషయమని కొనియాడారు. కార్యక్రమంలో ఇంటర్మీడియెట్ జిల్లా అధికారిణి మాధవి, వివిధ కళాశాలల ప్రిన్సిపాల్స్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

స్టాక్ మార్కెట్ పేరిట సైబర్ మోసం

రూ.21.6 లక్షలు పోగొట్టుకున్న సాఫ్ట్‌వేర్ ఉద్యోగి

పటాన్‌చెరు టౌన్: సైబర్ కేటుగాళ్లు రెచ్చిపోతున్నారు. నకిలీ స్టాక్ మార్కెట్ పేరిట సాఫ్ట్‌వేర్ ఉద్యోగికి బురిడీ కొట్టించి నగదు కాజేశారు. ఈ ఘటన అమీన్‌పూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. అమీన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలోని సూర్యోదయ కాలనీ సాఫ్ట్‌వేర్ ఉద్యోగికి మార్చి 25న వాట్సాప్ ద్వారా స్టాక్ మార్కెట్‌కు సంబంధించిన మెసేజ్ వచ్చింది. అతడు తన వివరాలను నమోదు చేశాడు. అపరిచిత స్టాక్ మార్కెట్ నిర్వాహకులు ఐడీని క్రియేట్ చేసి ఇవ్వగా ఆన్‌లైన్‌లో నగదు ఇన్వెస్ట్ చేస్తూ వచ్చాడు. మొత్తం రూ.21.06 లక్షలు పెట్టుబడి పెట్టాడు. బాధితుడు తాను పెట్టిన నగదుతో పాటు లాభాలు ఇవ్వాలని అడుగగా అపరిచిత వ్యక్తి స్పందించలేదు. తాను మోసపోయినట్లు గుర్తించి ముందుగా సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. బుధవారం అమీన్‌పూర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేశారు.

హోటల్‌పై విరిగిపడిన చెట్టు

తృటిలో తప్పిన ప్రమాదం



ధ్వంసమైన హోటల్

టేక్మాల్(మెదక్): టేక్మాల్ మండలంలో మంగళవారం రాత్రి వీచిన బలమైన ఈదురుగాలులకు బొడ్మట్‌పల్లి చౌరస్తాలో ఓ చెట్టు విరిగి గ్రామానికి చెందిన ఉప్పు నర్సప్ప హోటల్‌పై పడింది. హోటల్‌లో ఐదుగురు ఉండగా తృటిలో ప్రమాదం తప్పింది. హోటల్ ఉన్న సామగ్రి రేకులు పూర్తిగా ధ్వంసమయ్యాయి. బుధవారం ఉదయం ఆర్ఐ సాయి శ్రీకాంత్ ఘటనా స్థలానికి చేరుకొని వివరాలను సేకరించారు. హోటల్ ఆధారపడి జీవిస్తుండగా పూర్తిగా కూలిపోవడంతో రోడ్డున పడ్డారని బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు కోరారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ



చిందరవందరగా పడి ఉన్న వస్తువులు

వెల్దుర్తి(తూప్రాన్) : తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ జరిగిన ఘటన మండలంలోని ఉప్పులింగాపూర్ గ్రామంలో చోటు చేసుకుంది. ట్రైనీ ఎస్సై జ్యోతి, బాధితుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన మర్కంటి సుశీల మంగళవారం బంధువుల ఇంటికి వెళ్లగా కుమారుడు ఈశ్వర్ ప్రైవేట్ కారు డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. బుధవారం ఉదయం ఈశ్వర్ ఇంటికొచ్చి చూసేసరికి ఇంటి తాళాలు పగులగొట్టి ఉన్నాయి. లోపలికి వెళ్లి చూడగా బీరువాలోని 20 తులాల వెండి వస్తువులతోపాటు రూ.30 వేలు నగదును దుండగులు దోచుకెళ్లినట్లు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని పంచనామా నిర్వహించారు. అదే విధంగా గ్రామానికి చెందిన ఖాజాపూర్ దుర్గయ్య ఇంటి తాళాలు పగులగొట్టగా చుట్టుపక్కల వారు మేల్కొనడంతో దుండగులు పరారయ్యారు.

వ్యక్తి హత్య కేసులో నిందితుడి అరెస్ట్

సంగారెడ్డి క్రైమ్: వ్యక్తి హత్య కేసులో నిందితుడిని పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. పట్టణ సీఐ రమేశ్ బుధవారం తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని నేతాజీ నగర్‌కు చెందిన పాండరి రాజు 10న ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. అదే కాలనీకి చెందిన రాజవేళి ఈశ్వర్‌పై వచ్చిన అనుమానంతో ప్రత్యేక టీమ్ అతడిపై నిఘా పెట్టింది. బుధవారం పాత బస్టాండ్ సమీపంలోని మండే మార్కెట్ కల్లు కాంపౌడ్‌లో అదుపులోకి తీసుకొని విచారించగా హత్య చేసినట్లు ఒప్పుకున్నాడు. రాజు తనకు డబ్బులు ఇవ్వాలని, ఇవ్వకపోవడంతో కక్ష పెంచుకొని 10న శనివారం రాత్రి మద్యం సేవించిన అనంతరం రాజుకు ఫోన్ చేసి రాజీవ్ పార్క్‌కి రమ్మని చెప్పానన్నాడు. సున్నీతో రాజు గొంతు నులిమి, పక్కనే ఉన్న బండరాయితో ముఖంపై కొట్టి హత్య చేసినట్లు తెలిపాడు. మృతుడి భార్య హారతి ఫిర్యాదు మేరకు నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు.

అటకెక్కిన అవుట్ పోస్టులు

మూడు జిల్లాల పరిధిలో 20 రైల్వేస్టేషన్లు

- ఒకే ఒక్క పోలీస్ అవుట్ పోస్టు
- 20 రైల్వేస్టేషన్లలో సవాల్‌గా మారిన భద్రత
- నిత్యం పెరుగుతున్న రైల్వే కేసులు

మూడు జిల్లాలు.. 20 రైల్వేస్టేషన్లు.. రెండు వందల కిలోమీటర్ల పరిధి.. వెరసి ఒకే ఒక పోలీస్ అవుట్ పోస్టు ఇదీ రైల్వేశాఖ పరిస్థితి. ఫలితంగా రైల్వేస్టేషన్ల పరిధిల్లో అక్రమ రవాణాలు, చోరీలు, పెరుగుతున్నాయి. ప్రతి నెలా కనీసం 25 వరకు కేసులు నమోదవుతున్నాయి. అవుట్ పోస్టులు లేక సిబ్బంది అందుబాటులో ఉండకపోవడంతో అక్రమ రవాణాలు, నేరాలు పెరుగుతున్నాయి. జిల్లాకు ఒక పోస్టు కావాలని అధికారులు ప్రతిపాదనలు పంపినా కార్యరూపం దాల్చలేదు. – రామాయంపేట (మెదక్)

కామారెడ్డి జిల్లా కేంద్రంలో ఉన్న రైల్వే అవుట్ పోస్టు పరిధిలో కామారెడ్డి, మెదక్, సిద్దిపేట జిల్లాల్లో కలిపి మొత్తం 20 రైల్వే స్టేషన్లు ఉన్నాయి. మూడు జిల్లాల పరిధిలో సుమారుగా 200 కిలోమీటర్ల మేర రైల్వే లైన్ విస్తరించి ఉంది. 20 రైల్వే స్టేషన్లకు సంబంధించి కామారెడ్డి స్టేషన్ ఆవరణలో ఒకే ఒక్క అవుట్ పోస్టు ఉంది. 35 ఏళ్ల కిందటే ఇది ఏర్పాటైంది. మెదక్ జిల్లాలో అక్కన్నపేట నుంచి ప్రారంభమై జిల్లా శివారు కూచారం వరకు 45 కిలోమీటర్ల మేర రైల్వే లైను విస్తరించి ఉండగా, జిల్లా పరిధిలో 12 స్టేషన్లు ఉన్నాయి. ఇక్కడ అవుట్ పోస్టు లేకపోవడంతో పోలీసుల పర్యవేక్షణ కరువై నెలలో కనీసం 15 నుంచి 18 వరకు రైల్వే కేసులు నమోదవుతున్నాయి. ఎక్కువగా యువకులు రైలు కింద పడి ఆత్మహత్యలు చేసుకోవడం, నిషేధిత గంజాయి సరఫరా, బియ్యం అక్రమ రవాణాతో పాటు దొంగతనాలు విపరీతంగా జరుగుతున్నాయి.

అవుట్‌పోస్టుల ప్రతిపాదనలు

ప్రతి జిల్లాలో కనీసం ఒక అవుట్ పోస్టు ఏర్పాటు చేయాలని రైల్వే శాఖ ఉన్నతాధికారులు గతంలో నిర్ణయించినా అది కార్యరూపం దాల్చలేదు. ఈ అవుట్ పోస్టు పరిధి ఎక్కువగా ఉండటంతో



కామారెడ్డి రైల్వేస్టేషన్ ఆవరణలో పోలీస్ అవుట్ పోస్టు

ప్రతిరోజూ ఎక్కడో ఒక చోట నేరాలు, ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. సిబ్బంది కొరతతో ఉన్న స్టాఫ్ పని భారంతో సతమతమవుతుంది. వెరసి పోలీసులు ఘటనా స్థలికి చేరుకోవడం ఆలస్యమవుతుండటంతో బాధితులు ఇబ్బందుల పాలవుతూ గంటల తరబడి నిరీక్షిస్తున్నారు.

సీసీ కెమెరాలెక్కడ?

అన్ని రైల్వేస్టేషన్లలో చోరీలను అరికట్టడం, నేరస్తులను గుర్తు పట్టడానికి గాను వీలుగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలనే ఆదేశాలున్నా అవి అమలుకు నోచుకోలేదు. సీసీ కెమెరాలుంటే సాధ్యమైనంత మేర నేరాలు తగ్గే అవకాశం ఉంది. 20 స్టేషన్లకు గాను కేవలం కామారెడ్డి స్టేషన్‌లో సీసీ ఫుటేజీ ఏర్పాటు చేశారు. కనీసం నాలుగైదు స్టేషన్లకు ఒక అవుట్ పోస్టును ఏర్పాటు చేస్తే బాగుంటుందని ప్రయాణికులు పేర్కొంటున్నారు.



రైలులో తనిఖీ నిర్వహిస్తున్న రైల్వే పోలీసులు

మూడు జిల్లాల పరిధిలో ఉన్న రైల్వేస్టేషన్లు

కామారెడ్డి, తలమడ్ల, తిప్పాపూర్, బిక్కనూరు, రామేశ్వపల్లి, అక్కన్నపేట, మీర్జాపల్లి, వడియారం, శ్రీనివాసనగర్, బ్రాహ్మణపల్లి, పాలాట పోతారం, మనోహరాబాద్, కూచారం, మెదక్, లక్ష్మాపూర్, ఔరంగాబాద్, నాచారం, గజ్వేల్, కొడకండ్ల, సిద్దిపేట రైల్వేస్టేషన్లు ఉన్నాయి. ఈ విషయమై రైల్వేశాఖకు చెందిన అధికారి ఒకరు మాట్లాడుతూ.. ప్రతి జిల్లాలో ఒక అవుట్ ట్‌పోస్టు ఏర్పాటుకై ప్రతిపాదనలు ఉన్నాయన్నారు. ఈ మేరకు ఉన్నతాధికారులు దృష్టి సారించారని తెలిపారు.

ఇరిగేషన్ ఉద్యోగి ఆత్మహత్య

ఆర్థిక ఇబ్బందులే కారణం



రామకృష్ణ (ఫైల్)

తూప్రాన్: ఆర్థిక ఇబ్బందులతో ఇరిగేషన్ ఉద్యోగి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన పట్టణ కేంద్రంలో బుధవారం చోటు చేసుకుంది. ఎస్ఐ యాదగిరి–2 కథనం మేరకు.. పట్టణంలోని ఎస్సీ కాలనీకి చెందిన మోడ బోయిన రామకృష్ణ(35) సిద్దిపేట జిల్లా రంగనాయక సాగర్‌కి సంబంధించి ఇరిగేషన్ శాఖలో అటెండర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. రామకృష్ణ ప్రైవేట్ సంస్థల్లో రుణం తీసుకున్న కారణంగా వచ్చే జీతం పూర్తిగా రుణం తీసుకున్న దానికి అసలు, వడ్డీ సరిపోతుండేది. ఇల్లు గడవం కష్టంగా మారడంతో ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొన్నాడు. ఈ క్రమంలో నిత్యం మనస్తాపానికి గురయ్యేవాడు. కానీ ఇంట్లో కుటుంబ సభ్యులకు రుణం తీసుకున్న విషయం తెలియజేయలేదు. తనలో తానే మదనపడుతుండేవాడు. బుధవారం ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి భార్య అఖిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ తెలిపారు.

రైలు కిందపడి వ్యక్తి

జహీరాబాద్ టౌన్: గుర్తు తెలియని వ్యక్తి జహీరాబాద్– వికారాబాద్ మధ్య నడిచే రైలు కింద పడి వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన కోహీర్ సమీపంలో బుధవారం రాత్రి చోటు చేసుకుంది. వికారాబాద్ రైల్వే పోలీసులకు సమాచారం అందడంతో ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతుడి పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

తాగుడుకు బానిసై వ్యక్తి

నర్సాపూర్ రూరల్: తాగుడుకు బానిసై వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన నర్సాపూర్ పట్టణంలోని శ్రీరాంనగర్ కాలనీలో చోటు చేసుకుంది. నర్సాపూర్ ఎస్ఐ లింగం కథనం మేరకు.. శ్రీరామ్ నగర్ కాలనీకి చెందిన వాల్మీకి అవినాష్ (29) నిత్యం భార్యతో ప్రతిమతో గొడవ పడుతున్నాడు. తాగుడుకు డబ్బులు లేకపోవడంతో జీవితంపై విరక్తి చెంది ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ లింగం తెలిపారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో 72 కేసులు

సిద్దిపేట సీపీ అనురాధ

సిద్దిపేటకమాన్: పోలీసు కమిషనరేట్ పరిధిలో పోలీసు సిబ్బంది నిర్వహించిన స్పెషల్ డ్రైవ్‌లో 72 డ్రంకెన్ డ్రైవ్ కేసులు నమోదు చేసినట్లు సీపీ అనురాధ తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కమిషనరేట్ పరిధిలో బుధవారం సాయంత్రం 5 నుంచి 7 గంటల వరకు స్పెషల్ డ్రైవ్ ద్వారా ఆకస్మిక వాహన తనిఖీలు నిర్వహించామన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణ, అక్రమ రవాణా నివారణకు వాహనాలు తనిఖీ చేయడం జరిగిందన్నారు. 72 డ్రంకెన్ డ్రైవ్ కేసులతోపాటు ట్రాఫిక్, రోడ్డు నిబంధనలు పాటించని వాహనదారులపై 299 కేసులు నమోదు చేయడం జరిగిందని తెలిపారు. తనిఖీల్లో సిద్దిపేట ఏసీపీ మధు, వన్ టౌన్ సీఐ వాసుదేవరావు, టూ టౌన్ సీఐ ఉపేందర్, త్రీ టౌన్ సీఐ విద్యాసాగర్, రూరల్ సీఐ శ్రీను, ట్రాఫిక్ సీఐ ప్రవీణ్‌కుమార్, పోలీసు అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



వాహనాల తనిఖీలో ఏసీపీ మధు, పోలీసు సిబ్బంది

ప్రతీసారి వందశాతం సాధించాలి

- విద్యార్థుల్లో స్ఫూర్తి నింపేందుకే పురస్కారాలు
- తల్లిదండ్రుల ప్రోత్సాహం ఎంతో ముఖ్యం
- ఎంపీ రఘునందన్‌రావు



ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థిని సన్మానిస్తున్న ఎంపీ రఘునందన్‌రావు

మెదక్ కలెక్టరేట్: వచ్చేయేడు నుంచి ప్రతీసారి వందశాతం ఫలితాలతో విద్యారంగంలో మెతుకు సీమ సత్తా చాటాలని, విద్యార్థుల ఆలోచనలకు అనుగుణంగా తల్లిదండ్రులు ప్రోత్సహించాలని మెదక్ ఎంపీ మాధవనేని రఘునందన్ రావు పేర్కొన్నారు. బుధవారం జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంలో ఇటీవలె వెలువడిన పదవ తరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు, పాఠశాలల హెచ్‌ఎంలకు సన్మాన, పురస్కార కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ఎంపీ మాధవనేని రఘునందన్ రావు, కలెక్టర్ రాహుల్ రాజ్, డీఈఓ రాధా కిషన్, జిల్లా సైన్స్ అధికారి రాజిరెడ్డి, అకాడమిక్ మానిటరింగ్ అధికారి సుదర్శన్ మూర్తి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ.. వచ్చే విద్యా సంవత్సరంలో నూరు శాతం ఫలితాలు లక్ష్యంగా మెతుకు సీమ జిల్లా కీర్తిని విద్యారంగంలో చాటి చెప్పాలని ఎంపీ పేర్కొన్నారు. పదవ తరగతి పాసైన విద్యార్థులను ఇంటర్‌లో చేరేలా కలెక్టర్ తీసుకుంటున్న చొరవ క్షేత్ర స్థాయిలో సత్ఫలితాలు అందిస్తాయని చెప్పారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. పదో తరగతి ఫలితాల్లో రాష్ట్రంలోనే జిల్లా 12వ స్థానం సాధించడం గర్వకారణమన్నారు. 196 మంది విద్యార్థులు 550 మార్కులు సాధించగా, 17 మంది 570 పైన మార్కులు సాధించినట్లు తెలిపారు. ఉత్తమ మార్కులు సాధించిన 196 మంది విద్యార్థులతో పాటు వారి తల్లిదండ్రులను, 82 మంది పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ప్రిన్సిపాల్, ప్రత్యేక అధికారులకు సన్మానించి ప్రశంసాపత్రాలు అందించారు. అనంతరం ఎంపీ రఘునందన్‌రావును ఘనంగా సన్మానించారు. సమావేశంలో అన్ని మండలాల ఎంఈఓలు, పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, హాస్టల్ వార్డెన్లు, సంబంధిత సిబ్బంది, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

కుటుంబ సమేతంగా దొంగతనాలు

- నలుగురిని అరెస్ట్ చేసిన పోలీసులు
- భారీగా బంగారం, రూ.4 లక్షల నగదు స్వాధీనం



మాట్లాడుతున్న డీఎస్పీ సత్తయ్య

సంగారెడ్డి టౌన్ : వరుసగా దొంగతనాలకు పాల్పడుతున్న కుటుంబ సభ్యుల ముఠాను బుధవారం సంగారెడ్డి పోలీసులు అరెస్టు చేశారు. సంగారెడ్డి డీఎస్పీ సత్తయ్య గౌడ్ బుధవారం సంగారెడ్డి రూరల్ పోలీస్ స్టేషన్‌లో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి కేసు వివరాలు వెల్లడించారు. సంగారెడ్డికి చెందిన యాదగిరి(44), అతడి భార్య అనిత(42), కుమారుడు మైనర్ బాలుడు(17), ముస్లాపూర్ గ్రామానికి చెందిన తలారి లక్ష్మీ (34) బుధవారం సంగారెడ్డి పట్టణంలో అనుమానాస్పదంగా కనిపించడంతో పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఒకే కుటుంబానికి చెందిన నలుగురు జల్సాలకు అలవాటు పడి తాళం వేసిన ఇళ్లలో చోరీలకు పాల్పడుతున్నట్లు తెలిపారు. జిల్లాలోని హత్నూర, సంగారెడ్డి టౌన్ రంగారెడ్డి పోలీస్ స్టేషన్ పరిధిలో ఈ ఏడాది ఆరు దొంగతనాలతోపాటు వికారాబాద్ నర్సాపూర్ మోమిన్‌పేటలో మొత్తం 53 దొంగతనాలు చేసినట్లు పోలీసుల విచారణలో వెల్లడైంది. నిందితుల నుంచి 29 తులాల బంగారం, 47 తులాల వెండి, రూ.4 లక్షల నగదు, బైక్‌ను స్వాధీనం చేసుకొని నిందితులను రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. కేసులో కీలకంగా వ్యవహరించిన రూరల్ సీఐ క్రాంతి కుమార్, ఎస్ఐ రవీందర్, క్రైమ్ సిబ్బందిని డీఎస్పీ అభినందించారు.

దారి దోపిడీ కేసులో ముగ్గురు అరెస్ట్

తూప్రాన్: దారి దోపిడీ కేసులో ముగ్గురు నిందితులను అరెస్టు చేసినట్లు ఎస్ఐ శివానందం బుధవారం తెలిపారు. వివరాల్లోకి వెళ్తే.. మధ్యప్రదేశ్‌కు చెందిన మనీశ్ కుమార్ గుర్జీ గత నెల 30న మేడ్చేల్ నుంచి ఆటోలో వస్తున్న క్రమంలో డ్రైవర్‌తోపాటు మరో ఇద్దరు దాడి చేసి నగదు,సెల్‌ఫోన్ ఎత్తుకెళ్లారు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేపట్టి మేడ్చేల్‌కు చెందిన మల్లేశం, బొల్లారానికి చెందిన శ్రీకాంత్, నేరేడ్‌మెట్‌కు చెందిన మధును గుర్తించి అరెస్టు చేశామని తెలిపారు.

పిడుగుపాటుతో మహిళ మృతి



రత్నమ్మ(ఫైల్)

జహీరాబాద్: పిడుగుపాటుతో మహిళ మృతి చెందిన ఘటన కోహీర్ మండలంలోని నాగిరెడ్డి పల్లిలో బుధవారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. నాగిరెడ్డి పల్లి గ్రామానికి చెందిన రత్నమ్మ(55) పొలం పనులకు వెళ్లింది. ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం రావడంతో చెట్టు కిందకు వెళ్లగా పిడుగుపడి అక్కడికక్కడే మృతి చెందింది. మరో మహిళ నాగమ్మ గాయపడింది. వైద్యం నిమిత్తం ఆమెను ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

చికిత్స పొందుతూ మహిళ

మిరుదొడ్డి(దుబ్బాక): పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన మహిళ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందింది. ఈ ఘటన అక్బర్‌పేట–భూంపల్లి మండల పరిధిలోని మోతె గ్రామంలో చోటు చేసుకుంది. బుధవారం భూంపల్లి ఎస్ఐ హరీశ్ కథనం మేరకు.. గ్రామానికి చెందిన నర్మెట కళవ్వ (52) దీర్ఘకాలిక వ్యాధులతో సతమతమవుతుండేది. ఎన్ని ఆస్పత్రుల్లో చికిత్స చేయించుకున్నా ఫలితం లేకుండా పోయింది. దీంతో జీవితంపై విరక్తి చెంది 12న పురుగు మందు తాగి అపస్మారక స్థితిలోకి వెళ్లింది. కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం సిద్దిపేట జిల్లా ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం సికింద్రాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మృతి చెందింది. మృతురాలి భర్త రాజయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి

పాపన్నపేట(మెదక్): అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి చెందిన ఘటన మండల పరిధిలోని పొడిచన్‌పల్లిలో బుధవారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. పొడిచన్‌పల్లికి చెందిన సర్దన కిష్టయ్య(40)కు భార్య లక్ష్మి, కూతురు గంగమణి, కుమారుడు బీరప్ప ఉన్నారు. వ్యవసాయంపై ఆధారపడి జీవనం కొనసాగిస్తున్నాడు. మంగళవారం రాత్రి మద్యం సేవించి ఇంట్లో పడుకున్నాడు. తెల్లవారు లేచి చూసే సరికి చనిపోయి ఉన్నాడు. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు పాపన్నపేట ప్రొబెషనరీ ఎస్ఐ నరేశ్ కేసు నమోదు చేసుకున్నారు.

గేదెను తప్పించబోయి లారీ డ్రైవర్

చిన్నకోడూరు(సిద్దిపేట): గేదెను తప్పించబోయి అదుపు తప్పి లారీ బోల్తా పడటంతో లారీ డ్రైవర్ మృతి చెందాడు. ఈ ఘటన మండల పరిధిలోని రామునిపట్ల శివారులో రాజీవ్ రహదారిపై బుధవారం జరిగింది. పోలీసుల కథనం మేరకు.. మంచిర్యాల జిల్లా కాసీంపేట మండలం, మల్కాపల్లి గ్రామానికి చెందిన వల్లూరి రాకేశ్ (26) సిద్దిపేటకు చెందిన వ్యాపారి వద్ద లారీ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. మంచిర్యాల నుంచి సిమెంట్ లోడ్ లారీతో సిద్దిపేటకు వస్తున్నాడు. రామునిపట్ల శివారులోకి రాగానే రోడ్డుపై గేదె అడ్డురావడంతో తప్పించబోయి అదుపుతప్పి లారీ బోల్తా పడింది. డ్రైవర్ రాకేశ్‌కు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే ఆస్పత్రికి తరలించగా అప్పటికే రాకేశ్ మృతి చెందాడు. మృతుడి తండ్రి కిష్టయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ బాలకృష్ణ తెలిపారు.

రూ.80 లక్షలు మోసం.. యువకుడి అరెస్ట్

- వ్యాపారంలో వాటాలు, ప్రభుత్వ ఉద్యోగాల పేరిట
- గ్రామస్తుల నుంచి డబ్బులు వసూలు



నిందితుడు సాయి చరణ్

కొల్చారం(నర్సాపూర్): పాతికేళ్లు కూడా నిండని ఓ యువకుడు జనానికి మాయమాటలు చెప్పి భారీ ఎత్తున డబ్బులు కాజేశాడు. ఈ ఘటన బుధవారం కొల్చారం పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ మహమ్మద్ గౌస్ కథనం మేరకు.. మండలంలోని సంగాయిపేట గ్రామానికి చెందిన మన్నె శేఖర్ ఇటీవల కుమారుడు చేసిన అప్పులు తీర్చే క్రమంలో మనస్తాపానికి గురై ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అతడి కుమారుడు మన్నె సాయి చరణ్ సొంత మండలానికి చెందిన వ్యక్తుల నుంచి వ్యాపారంలో వాటా, భూముల అమ్మకాల్లో మధ్యవర్తిత్వం,ప్రభుత్వ ఉద్యోగాల పేరిట దాదాపు రూ.80 లక్షల వరకు వసూలు చేశాడు. డబ్బులు ఇచ్చిన వారికి తిరిగి ఇవ్వకపోగా మూడు నెలలుగా కనిపించకుండా పోయాడు. ఇటీవల గ్రామానికి రావడంతో డబ్బులు ఇచ్చిన వారు తిరిగి ఇవ్వాలంటూ ఒత్తిడి చేశారు. తన వద్ద లేవని చేతులెత్తేశాడు. బాధితులు కొల్చారం పోలీసులకు ఫిర్యాదు చేయగా సాయి చరణ్‌ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు. జనాలు అత్యాశకు పోవడంతోనే ఇలాంటి మోసాలు పెరుగుతున్నాయని, అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

చేపలు పట్టే అధికారం మాదంటే మాది

- వల్లూర్‌లో చెరువు వద్ద ఇరువర్గాల పంచాయితీ
- ఉద్రిక్తతకు దారి తీయడంతో పోలీసులు రంగ ప్రవేశం



ఇరువర్గాలతో చర్చిస్తున్న అధికారులు, పోలీసులు

చిన్నశంకరంపేట(మెదక్): చెరువులో చేపలు పట్టే అధికారం తమదంటే తమదని గ్రామంలోని ఇరువర్గాలు చేపలు పట్టేందుకు సిద్ధం కావడంతో నార్సింగి మండలం వల్లూర్ గ్రామంలో ఉద్రిక్తతకు దారి తీసింది. బుధవారం నార్సింగి మండలం వల్లూర్ గ్రామంలోని ఊర చెరువులో ముదిరాజ్‌లు చేపలు పట్టేందుకు సిద్ధం కాగా విషయం తెలుసుకున్న గ్రామంలోని ఇతర వర్గాల ప్రజలు తాము కూడా చేపలు పట్టుకుంటామని చెరువు వద్దకు చేరుకున్నారు. గ్రామంలోని చెరువులో చేపలు పట్టే అధికారం తమకే ఉంటుందని ముదిరాజ్‌లు, లేదు చెరువుపై గ్రామంలోని అందరికీ అధికారం ఉంటుందని మిగితా గ్రామ ప్రజల మధ్య వివాదం నెలకొంది. గతంలో ఇలానే జరిగితే కొందరిని పోలీసులు బైండోవర్ చేశారు. తాజాగా బుధవారం మరోసారి వివాదం నెలకొని ఉద్రిక్తతకు దారి తీసింది. రామాయంపేట సీఐ వెంకటరాజగౌడ్ ఆధ్వర్యంలో పెద్ద సంఖ్యలో అక్కడికి చేరుకున్న పోలీస్‌లు ఇరు వర్గాలను సముదాయించారు. గ్రామపంచాయతీ వద్దకు ఇరు వర్గాలను పిలిపించి చర్చించారు. ఇరు వర్గాలు కూడా తమకే హక్కులు ఉన్నాయని వాదనకు దిగడంతో 20 వరకు తమకు ఉన్న హక్కుల పత్రాలను పోలీస్‌లకు, రెవెన్యూ అధికారులకు అందించాలని సీఐ సూచించారు. అప్పటి వరకు ఎవరు చెరువులోకి చేపలు పట్టేందుకు వెళ్లొద్దని ఆదేశించారు. కార్యక్రమంలో తహసీల్దార్ కరీం,మత్స్య శాఖ ఏడీ మల్లేశం, ఎఫ్‌డీఓ రామ్‌దాస్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో దంపతులకు తీవ్రగాయాలు

టేక్మాల్(మెదక్): రోడ్డు ప్రమాదంలో దంపతులకు తీవ్రగాయాలైన ఘటన టేక్మాల్ మండలంలోని బొడ్మట్‌పల్లి 161 హైవేపై బుధవారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. అల్లాదుర్గం గ్రామానికి చెందిన వడ్డె బేతయ్య, ఆయన భార్య శ్రీలత బైక్‌పై సంగారెడ్డి వైపు వెళ్తున్నారు. వెనుకాల నుంచి బొలేరో వాహనం అతి వేగంగా వచ్చి ఢీకొట్టింది. మళ్లీ కారు ఢీకొట్టడంతో భార్యభర్తలకు తీవ్ర గాయాలయ్యాయి. ఘటనా స్థలానికి టేక్మాల్ పోలీసులు చేరుకొని వివరాలను సేకరించారు. క్షతగాత్రులను అంబులెన్స్‌లో జోగిపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు.



గాయాలతో బేతయ్య, శ్రీలత

అశ్లీల వీడియోలు పోస్ట్ చేస్తే కటకటాలకే?

- మెదక్ పట్టణంలో బీటెక్ విద్యార్థిపై కేసు
- జిల్లాల్లో మరో మూడు చోట్ల కేసులు
- మెదక్ పట్టణ సీఐ నాగరాజు



మెదక్ మున్సిపాలిటీ: సోషల్ మీడియాలో ఇక పై అశ్లీల పోస్టులు చేసే వారిపై కేసులు నమోదు చేస్తామని మెదక్ పట్టణ సీఐ నాగరాజు హెచ్చరించారు. బుధవారం ఆయన మాట్లాడుతూ.. యువత గూగుల్‌లో పోర్న్ వీడియోలు డౌన్‌లోడ్ చేసి ఎఫ్‌బి, ఇన్‌స్టాగామ్‌లలో పోస్టు పెడుతున్నారని, ఎలాంటి వారి పై కేసులు నమోదు చేస్తున్నట్లు వెల్లడించారు. సోషల్ మీడియాలో అశ్లీల పోస్టులపై సైబర్ సెక్యూరిటీ బ్యూరో, చైల్డ్ ప్రొటెక్షన్ యూనిట్ నిఘా పెట్టిందన్నారు. మెదక్ పట్టణంలో బీటెక్ విద్యార్థి అశ్లీల వీడియో పోస్టు చేస్తే ఆ యువకుడి పై కేసు నమోదు చేసినట్లు చెప్పారు. అలాగే జిల్లాలో టేక్మాల్, చిన్న శంకరం పేట, తూప్రాన్ లలో పోర్న్ వీడియోలు పోస్టు చేసిన వారి పై కేసులు నమోదయ్యాయని తెలిపారు. యువత అప్రమత్తంగా ఉండాలని, ఏదైనా వీడియో పోస్టు చేసే ముందు జాగ్రత్తగా ఆలోచించి చేయాలని సూచించారు. తప్పుడు పోస్టులు సోషల్ మీడియాలో పెట్టి భవిష్యత్‌ను నాశనం చేసుకోవద్దని సూచించారు.

వివాహేతర సంబంధానికి అడ్డొస్తున్నాడని..

- ప్రియుడితో కలిసి సుపారీ ఇచ్చి భర్తను హత్య చేయించిన భార్య
- హవేళిఘణాపూర్‌లో ఘటన



ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న సీఐ రాజశేఖర్‌రెడ్డి

హవేళిఘణాపూర్(మెదక్): వివాహేతర సంబంధానికి అడ్డు వస్తున్నాడని ప్రియుడితో కలిసి మరో వ్యక్తికి సుపారీ ఇచ్చి భర్తను హత్య చేయించింది భార్య. ఈ ఘటన మెదక్ జిల్లా హవేళిఘణాపూర్‌లో చోటు చేసుకుంది. మెదక్ రూరల్ సీఐ రాజశేఖర్‌రెడ్డి కథనం మేరకు.. మండల పరిధిలోని శమ్నాపూర్ గ్రామానికి చెందిన మైలి శ్రీను(25) ఏప్రిల్ 16న ఇంట్లో నుంచి కనిపించకుండా పోయాడు. ఈ విషయాన్ని భార్య లత 28న పోలీసులకు ఫిర్యాదు చేసింది. మృతుడి భార్య లత అదే గ్రామానికి చెందిన మల్లేశంతో వివాహేతర సంబంధం కొనసాగిస్తుంది. ఈ విషయంలో పలుమార్లు పంచాయితీ పెట్టారు. దీంతో ఎలాగైనా భర్తను హత్య చేసి అడ్డు తొలగించుకోవాలని భావించిన లత అదే గ్రామానికి చెందిన తన మిత్రుడు మోహన్‌కు రూ.50 వేలు సుపారీ ఇచ్చి హత్యకు ఒప్పందం కుదుర్చుకుంది. పథకం ప్రకారం గత నెల 16న మధ్యాహ్నం శ్రీనును బ్యాతోల్ గ్రామ శివారులోని అటవీ ప్రాంతంలోకి తీసుకెళ్లి మద్యం, కల్లు సేవించి సీసాతో నెత్తిపై కొట్టగా తలకు బలమైన గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందినట్లు విచారణలో తేలిందని సీఐ తెలిపారు. ఈ హత్యకు వివాహేతర కారణమని, దీనికి కారణమైన మృతురాలు భార్య మైలి లత, మోహన్, మల్లేశంను విచారించి కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ రాజశేఖర్‌రెడ్డి తెలిపారు. మృతదేహం పూర్తిగా కుళ్లిపోయి ఉండటంతో ఘటనా స్థలంలోనే పోస్టుమార్టం నిర్వహించినట్లు సీఐ రాజశేఖర్, ఎస్ఐ సత్యనారాయణ తెలిపారు.